

బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

- నడిసముద్రంలో కాలిన బోటు
- సురక్షితంగా బయటపడ్డ ఉప్పాడకు చెందిన 11మంది మత్స్యకారులు

'మంట'గలిపేశారు



కాకినాడ దశ, దిశను మార్చే కీలక ప్రాజెక్టుకు జగన్ సర్కారు మంగళం పాడేసింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఏమాత్రం బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రభుత్వం ఎన్నికల ముంగిట సైతం దీని గురించి పూర్తిగా వదిలేసింది. వేల కోట్ల పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగాలు వచ్చే పెట్రోకాంప్లెక్స్‌ను ఆ.. ఏముందిలే అన్న ధోరణితో ఏకంగా ఊపిరి తీసేసింది. ఫలితంగా విభజన హామీల్లో ఒకటైన రూ.32వేలకోట్ల పెట్రో కాంప్లెక్స్ కాకినాడకు రావడం ఇక అసాధ్యమేనని తేలిపోయింది.

- కాకినాడలో రూ.32వేలకోట్ల పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు కథేనా?
- వైసీపీ పాలనలో ఏనాడు దీన్ని పట్టించుకోని జగన్ సర్కారు
- తాజాగా ప్రధానిని కలిసినప్పుడు సైతం దీని ఊసేఎత్తని సీఎం
- పెట్రోకాంప్లెక్స్‌కు అనుమతులు ఇచ్చినా వీజీఎఫ్‌పై రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధగా ఉందని కేంద్రం వెల్లడి
- టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు ఏర్పాటుకు చకచకా చర్యలు
- వైసీపీ వచ్చినప్పటినుంచీ ప్రాజెక్టు ఊసే లేకుండా చేసిన జగన్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

తాజాగా సీఎం జగన్ ప్రధానిని కలిశారు. కానీ పెట్రో కాంప్లెక్స్ ప్రాజెక్టు ప్రస్తావనే తీసుకురాకపోవడంతో దాని ఏర్పాటు వ్యవహారం కథగానే మారినట్లయింది. ఈ ప్రాజెక్టు జాప్యానికి కారణం రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్రం కుండబద్దలు కొట్టింది. తాము అన్ని అనుమతులు ఇచ్చినా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ విషయంలో జగన్ ప్రభుత్వం ఉదాసీనంగా ఉందని నిజాలు బయటపెట్టింది. కానీ వైసీపీ ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లయినా లేకుండా పోయింది. వాస్తవానికి కీలకమైన పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. కానీ ఈలోపు వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటినుంచీ పెట్రో ప్రాజెక్టుపై ఏరోజు శ్రద్ధ వహించలేదు.

వైసీపీ వచ్చినప్పటినుంచీ అదే గతి..

రాష్ట్రానికి మేలు చేసే ఏ ప్రాజెక్టు, పెట్టుబడుల విషయంలోను జగన్ ప్రభుత్వం ఏనాడు శ్రద్ధ వహించలేదు. అధికారం అండతో అడ్డగోలు సంపాదన మినహా కీలక పరిశ్రమలు సాధించేలా ఒక్క అడుగు కూడా వేయలేదు. దీనికి నిలువెత్తు నిదర్శనమే కాకినాడలో రూ.32వేలకోట్ల పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు వ్యవహారం. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్రం కాకినాడలో రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తద్వారా ఈ ప్రాంతాన్ని భారీగా అభివృద్ధి చేస్తామని పేర్కొంది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ దీన్ని రాష్ట్రానికి సాధించాలన్న తపన ఏరోజూ కనబర్చలేదు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి దీన్ని సాధించేందుకు ప్రయత్నాలే చేయలేదు. దీంతో పదేళ్లు దాటినా ప్రాజెక్టు పురోగతి కాదుకదా ఇది రావడం అసాధ్యమేనని తేలిపోయింది. తాజాగా సీఎం జగన్ ప్రధాని మోదీని కలిశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టుల గురించి ఏకరువు పెట్టారు. కానీ కాకినాడకు అత్యంత కీలకమైన పెట్రో కాంప్లెక్స్ ఊసే తేలేదు. ఈ నేపథ్యంలో జగన్ సర్కారు పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు సంబంధించి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ నిధులు సమకూర్చడం లేదా కేంద్రమే భరించాలని ఒత్తిడి తేవడం ఏదీ చేయలేదు. ఈ నేపథ్యంలో అసలు ఈ ప్రాజెక్టును సాధించాలన్న ఆసక్తే వైసీపీ ప్రభుత్వానికి లేదనేది అర్థమైపోయింది. వాస్తవానికి ఈ ప్రాజెక్టును 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో 2వేల ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి గెయిల్- హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ముందుకు వచ్చి ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి గత టీడీపీ ప్రభుత్వంతో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాలనుంచి ముడి చమురును కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటు చేసి శుద్ధి చేసి దేశవ్యాప్తంగా వినియోగించాలని భావించాయి. లక్షలమందికి ఉద్యోగాలు లభించే ఈ ప్రాజెక్టుకోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. దీంతో చకచకా అనేక అనుమతులు లభించాయి. రూ.32వేల కోట్ల ఈప్రాజెక్టువల్ల రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధి పొందనున్నందున పన్నుల నేపథ్యంలో రూ.5,615కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది. కానీ విడిపోయిన రాష్ట్రం అంత భరించలేదని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడింది. కానీ ఈలోపు వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటినుంచీ జగన్ సర్కారు దీన్ని పూర్తిగా మూడేళ్లు గాలికి వదిలేసింది. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు రావడంతో అప్పట్లో ఓసారి కేంద్రాన్ని కలిసి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద తమ రాష్ట్రం ప్రాథమికంగా రూ.975కోట్లు చెల్లించే స్థితిలో లేదని, అయినా ప్రాజెక్టు ముందుకు వెళ్లేలా సహకరించాలని మొక్కుబడిగా కోరారు. కానీ కేంద్రం వినలేదు. వీజీఎఫ్ డబ్బులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఇదే సాకుతో జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గాలికి వదిలేసింది. కేంద్రం తో తనకు అనేక రకాల అవసరాలు ఉండడంతో కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు వ్యవహారాన్ని పక్కన పడేసి కేవలం అప్పుల కోసమే కేంద్రంతో రాజీ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ఇక కాకినాడకు కలగానే మారినట్లయింది.

నిజం తేలినా నిర్లక్ష్యమే..

పెట్రో కాంప్లెక్స్ మూలనపడడంతో అసలు ఇది వస్తుందా? రాదా? అనే దానిపై గతేడాది పలువురు ఎంపీలు కేంద్రాన్ని లోక్‌సభలో నిలదీశారు. దీని జాప్యానికి అసలు కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని అప్పట్లో కేంద్రం కుండబద్దలు కొట్టింది. తాము అన్ని అనుమతులు మంజూరు చేసినా నష్ట భర్తీ నిధి చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై నిర్ణయం ఏపీ ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా నిర్ణయం వైసీపీ సర్కారే తీసుకోవాలని సమాధానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాకినాడలో పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటులో జాప్యం పూర్తిగా జగన్ ప్రభుత్వానిదేనని తేలిపోయింది. కానీ ఇంత జరిగినా జగన్ సర్కారు ఇప్పటికీ ఉలుకు పలుకూ లేకుండా మారింది. అసలు ఈ ప్రాజెక్టు ఏపీకి అవసరం లేదనే ధోరణితో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అసలు ఈ ప్రాజెక్టు వచ్చే అవకాశం లేకపోవడంతో కాకినాడ సెజ్‌లో పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు గుర్తించిన 2వేల ఎకరాలు సైతం వేరొక యాజమాన్యం చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో పెట్రో కథ కలేనని తేలిపోయింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈలోపు ఎలాగూ ఈ ప్రాజెక్టు గురించి జగన్ సర్కారు ఆలోచించదు. అంటే ఈ ఐదేళ్లలో జగన్ సర్కారు పెట్రోప్రాజెక్టును పూర్తిగా మంటగలిపేసినట్లయింది. ఒకవేళ ప్రభుత్వం మారితే కొంతలో కొంతైనా ఈ ప్రాజెక్టుపై మళ్లీ కదలిక వచ్చే అవకాశం ఉంది. లేదంటే కాకినాడకు పారిశ్రామికంగా జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చే అవకాశం పూర్తిగా అడుగంటిపోయినట్లే.

ఉత్తరకంచి ఎస్‌బీఐ చోరీ ఘటనతో

ఉలిక్కిపడిన సామర్లకోట

- దొంగలు పదిరోజులు ఇక్కడే మకాం
- సామర్లకోట నుంచే రెక్కీ చేసినట్టు సమాచారం
- యూపీకి చెందిన అంతర్రాష్ట్ర ముఠా పనిగా ప్రాథమిక నిర్ధారణ

సామర్లకోట, ఫిబ్రవరి 12: ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్‌బ్యాంకు భారీ చోరీ ఘటనలో దొంగలు పదిరోజులపాటు సామర్లకోటలోనే ఉన్నారన్న సమాచారంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ప్రధాన మసీదు సమీపాన నివాసంఉన్నట్లు పోలీసులకు ప్రాథమికంగా సమాచారం వచ్చింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి తదితర పోలీసు అధికారులు సోమవారం సామర్లకోటలో దొంగలు నివశించిన ఇంటిని తనిఖీ చేశారు. చోరీ సంఘటనకు పాల్పడే ముందు దొంగల ముఠాకు చెందిన నలుగురూ మసీదు సమీపాన ముస్లింలకు చెందిన ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తితో సామర్లకోటలోని ఈ ఇంటి యజమానికి ఫోన్ చేయించారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులైనా ఇంటిని అద్దెకు ఇచ్చినట్లు పోలీసులు ఇంటి యజమాని ద్వారా సమాచారాన్ని సేకరించారు. వీరు హిందీ అనర్గళంగా మాట్లాడుతుండడంతో సహజంగానే ముస్లింలు అధికంగా నివశించే ప్రాంతం కావడంతో వీరి కదలికలపై ఎవరికీ అంతగా అనుమానాలు రాలేదని తెలిసింది. వీరికి ఒక కారు కూడా ఉందని, అందులోనే వీరు రాకపోకలు సాగించారని సమాచారం. రెండురోజులపాటు రాత్రివేళల్లో కారులో బయటకు వెళ్లి తెల్లవారుజామున వచ్చారని, వీరు అద్దెకు ఉన్న ఇంటి సమీపంలో రోడ్డు పక్కన కారు పార్కింగ్ చేశారని సమాచారం. గత బుధవారం వీరు నివసించే ఇంటి పక్కనే ముస్లింలకు చెందిన చికెన్ షాపులో రూ.200 ఇచ్చి చికెన్ కొనుగోలుకు వెళ్లి హిందీలోనే మాట్లాడారని తెలిసింది. వారు నివసించిన ఇంట్లో 5కిలోల గ్యాస్ నింపబడే చిన్ని సిలిండర్ కమ్ బర్నర్ ఉందని, దాన్నే వంటకు వినియోగించారని సమాచారం. దానితోనే బ్యాంకు కిటికీల ఐరన్ గ్రిల్ కట్ చేసినట్లు పోలీసులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. దీని నిమిత్తం సామర్లకోటలో వీరు నివసించిన ఇంటి కిటికీ ఐరన్ గ్రిల్ హీట్ చేసి కట్ చేశారు. దీన్ని పోలీసు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అంటే దొంగలు సామర్లకోటలో ట్రయల్ వేయడమే గాక అందుకు వినియోగించిన చిన్ని గ్యాస్ సిలిండర్‌లో 5 కిలోల గ్యాస్‌ను సామర్లకోటలోని పెద్దాపురం రోడ్డులో ఒక దుకాణం వద్ద ఫిల్లింగ్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో చోరీకి సంబంధించి సరంజామా అంతా సామర్లకోటలోనే సమకూర్చుకుని ఉత్తరకంచి బ్యాంకువద్ద రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. ఈ చోరీలో భారీఎత్తున బంగారు ఆభరణాలు, పెద్దమొత్తంలో నగదును చోరీ చేశారు. ఆ మరుసటి రోజే సామర్లకోటలోని ఇంటిని ఖాళీ చేసి పరారయ్యారని పోలీసులు నిర్ధారించారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారా..



సామర్లకోటలో ఓ ఇంటివద్ద దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు

ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్ బ్యాంకులో చోరీకి పాల్పడిన దొంగల ముఠా ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చోరీ అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి సేకరించిన నేర సమాచారం మేరకు ఈ తరహా దొంగతనం చేసేది యూపీకి చెందిన ముఠాయే అయి ఉంటుందని భావిస్తున్నారు. యూపీలో ఈ తరహాలో బ్యాంకు చోరీలకు పాల్పడడంలో ఈ ముఠాకు ఆ రాష్ట్రంలో పెద్ద నేరచరిత్ర ఉన్నట్లు భావిస్తున్నారు. వారి భాష, కదలికలను బట్టి కూడా దొంగలు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారిగా భావిస్తూ పోలీసులు ఆ దిశలో దర్యాప్తు మరింత లోతుగా చేస్తున్నారు. పోలీసు బృందాలతో గాలింపు చర్యలు జిల్లావ్యాప్తంగా ముమ్మరం చేసినట్లు సమాచారం.

నత్తనడకన..



కాకినాడ రూరల్ రమణయ్యపేట సచివాలయంవద్ద రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారుల పడిగాపులు

- జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు అవరోధాలు
- సచివాలయాల వద్ద పడిగాపులు
- ఆన్‌లైన్ సమస్యలతో ఇబ్బందులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 12: నవరత్నాలు పథకంలో ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల స్థలానికి లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తక్షణమే ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు గ్రామ, వార్డు సచివాలయాలవద్ద పూర్తిస్థాయిలో సమాయత్తం కాకుండానే రిజిస్ట్రేషన్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో నత్తనడకన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. అరగంటకో రిజిస్ట్రేషన్ చేయలేని పరిస్థితులు నెలకొనడంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద గంటలసేపు పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌లో సమస్యలు

జగనన్న లే అవుట్లలో కేటాయించిన స్థలాలకు లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా 9లేఅవుట్లలో కాకినాడ రూరల్ మండలంలో 16,313వేలకు పైబడి ఇళ్ల పట్టాలను ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఒక్కో లబ్ధిదారునికి 72 గజాల వంతున స్థలం కేటాయించి అప్పగించింది. ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కోసం కాకినాడ రూరల్ మండలంలోని 42 సచివాలయాలవద్ద రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చిన తర్వాత గ్రామ పంచాయతీల్లో జరిగే అన్ని రిజిస్ట్రేషన్లు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే నిర్వహించాలని నిర్ణయించడం, ఆరు నెలల కిందట గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రిజిస్ట్రేషన్ చేయడంపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద శిక్షణ ఇప్పించారు. ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ కోసం నాలుగురోజులుగా కాకినాడ రూరల్ మండలంలో ఆయా సచివాలయాలవద్ద రిజిస్ట్రేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రిజిస్ట్రేషన్‌కోసం లబ్ధదారులు 9 గంటలకు సంబంధిత గ్రామ సచివాలయాలకు చేరుకుంటున్నారు. ఆన్‌లైన్ సమస్యలతో వీరంతా గంటల తరబడి పడిగాపులు పడుతూ అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొందరు మధ్యాహ్నం ఇళ్లకు భోజనాలు కోసం వెళ్లి తిరిగి వచ్చి సాయంత్రం వరకు అక్కడే నిరీక్షిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సర్వర్, బయోమెట్రిక్ డివైజ్‌లు, సర్వర్ సాంకేతిక సమస్యలతో తీవ్రజాప్యం చోటుచేసుకుంటుంది. చివరకు రోజుకి 15 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్లు జరగని పరిస్థితులు నెలకొనడంతో నానా అవస్థలకు గురవుతున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ కావడం, సిబ్బంది అనుభవలేమి తదితర కారణాలతో ఈ ప్రక్రియపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ సులభతరంగా జరిగేలా అవసరమైన చర్యలు అధికారులు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జిల్లాస్థాయి 'స్పందన'కు 403 అర్జీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందనకు 403 అర్జీలు అందాయి. కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ సీవీ ప్రవీణ్‌ఆదిత్య, జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, డీపీవో కె.భారతి సౌజన్య, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

52మంది గురుకుల పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- 8మందికి ఏరియా ఆస్పత్రిలో చికిత్స
- కలుషిత ఆహారం కారణమంటున్న వైద్యులు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఆదివారపుపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘటన

బియ్యం ధరల బాదుడు



- 26 కిలోల బియ్యం బస్తా రూ.1700
- ధరల నియంత్రణకు కానరాని చర్యలు
- ఏం కొంటాం.. ఏం తింటాం అంటూ సామాన్యుల ఆవేదన

పెద్దాపురం, ఫిబ్రవరి 12: బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వారంరోజుల వ్యవధిలోనే 10శాతంపైగా బియ్యం ధరలు పెరిగిపోయాయి. మధ్యతరగతి, ఆపైవర్గాలకు చెందినవారు సన్నబియ్యంపై మొగ్గు చూపిస్తుండడంతో రకరకాల బ్రాండ్ల పేరుతో వ్యాపారులు బియ్యం ధరలను పెంచేస్తున్నారు. సామాన్యులు, చిరుద్యోగులు, వివిధ రకాల వృత్తులపై ఆధారపడిన వారు పెరుగుతున్న బియ్యం ధరలను భరించలేకపోతున్నారు. గతంలో సన్నరకం బియ్యం వెరైటీని బట్టి 26 కిలోల బస్తా రూ.1150 నుంచి రూ.1300 వరకూ ఉండేది. ఇప్పుడు ఆ ధర రూ.1400 నుంచి రూ.1700 వరకూ పెరిగింది. గత ఆరు నెలల్లో రూ.250 నుంచి రూ.400 వరకూ ధరలు పెరిగాయి.

నియంత్రణ ఏది?

ప్రభుత్వంనుంచి లైసెన్సు పొంది జీఎస్టీ ఉంటూ హోల్‌సేల్ డీలర్లు, ట్రేడర్లు బియ్యం ధరలను విచ్చలవిడిగా పెంచుతుంటే సివిల్ సప్లైస్ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. బియ్యం ధరలు కిలో ఒక్కింటికీ రూ.45 నుంచి రూ.60 వరకూ ఉన్నాయి. సన్న రకం, హెచ్ఎంటీ, స్టీమ్ రకరకాల పేర్లతో బియ్యం ధరలను పెంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాలనుంచి దిగుమతి అవుతున్నా యంటూ కొన్నిరకాల బియ్యం ధరలను మరింతగా పెంచే స్తున్నారు. బియ్యం సంచులపై వివిధ రకాల బ్రాండ్ల పేరు చూపించి సూపర్ ఫైన్ రకం అంటూ 26 కిలోల బస్తా రూ.1500నుంచి రూ.1600కి వ్యాపారులు అమ్ముతున్నారు. గ్రామీణప్రాంతాల్లో ప్రజలు బియ్యం కొనుగోలు చేయాలంటేనే హడలెత్తిపోతున్నారు. అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న బియ్యంధరలను చూసి ప్రజలు ఆందోళన చెందుతుంటే సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ధాన్యం అమ్మకం.. బియ్యం కొనడం..

రైతులు తాము పండించిన ధాన్యాన్ని గతంలో మిల్లింగ్ చేయించి బియ్యాన్ని వినియోగించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అధికశాతం రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా అమ్మేసి సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో బియ్యానికి డిమాండ్ పెరిగింది. వినియోగదారులు పెరగడంతో ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత రేషన్ బియ్యం వినియోగదారులనుంచి బహిరంగ మార్కెట్‌లోకి చేరుకుంటోంది. ఎక్కువశాతం మంది ఉచిత బియ్యాన్ని కిలో రూ.8నుంచి రూ.10కి వ్యాపారులకు అమ్మేస్తున్నారు. దీంతో సన్నబియ్యం, మధ్యరకం బియ్యానికి మార్కెట్లో డిమాండ్ ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి.

స్టాంపు డ్యూటీ..

సొమ్ములేవి?

- స్థానిక సంస్థల జేబుకు చిల్లు
- రిజిస్ట్రేషన్‌శాఖకు జిల్లాలో ఏటా రూ.296.34కోట్ల మేర ఆదాయం
- జిల్లాలోని స్థానిక సంస్థలకు రావాల్సిన మొత్తం రూ.52.24కోట్లు
- పదినెలలుగా పెండింగ్
- విడుదల చేయని ప్రభుత్వం
- పంచాయతీల ఆపసోపాలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 12: రిజిస్ట్రేషన్‌శాఖకు జిల్లాలో ఏటా రూ.300కోట్లనుంచి రూ.400కోట్ల మేర ఆదాయం లభిస్తోంది. రిజిస్ట్రేషన్ నిర్వహిస్తే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 7.5శాతం స్టాంప్ డ్యూటీ వసూలుచేస్తారు. ఇందులో ఆరుశాతం ప్రభుత్వ ఖజానాకు మిగిలిన 1.5శాతం స్థానిక సంస్థలైన మున్సిపాల్టీలు, జిల్లాపరిషత్, గ్రామ పంచాయతీల ఖాతాలకు ప్రతినెలా ఇవ్వాలి. గ్రామీణప్రాంతాల్లో వసూలయ్యే స్టాంపు డ్యూటీని ఐదొంతులుగా విభజిస్తారు. ఇందులో మూడొంతులు సంబంధిత పంచాయతీకి, ఒక వంతు మండల పరిషత్, మరో వంతు జడ్పీ ఖాతాలో జమచేస్తారు. ఆ లెక్కన జిల్లాలో స్టాంపు డ్యూటీ రూపంలో వచ్చే ఆదాయంలో ఏటా రూ.70 నుంచి 80కోట్లమేర స్థానిక సంస్థలకు చేరాలి.

ప్రతినెలా లెక్కలు చూసి గతంలో స్థానిక సంస్థలకు మళ్లించేవారు. ఆ సొమ్ములను పంచాయతీల అభివృద్ధికి వినియోగించేవి. పది నెలలుగా ప్రభుత్వం ఈ బకాయిలను పెండింగ్ పెట్టింది. 2023, మార్చి నుంచి డిసెంబర్ నాటికి కాకినాడ జిల్లాలో 71,241 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటికి గాను జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి రూ.296.34కోట్లు రెవెన్యూ వచ్చింది. ఇందులో స్థానిక సంస్థలకు రూ.52.24కోట్లు చెల్లించాలి. కానీ ప్రభుత్వమే ఆ నిధులను వినియోగిస్తూ స్థానిక సంస్థలకు అభివృద్ధికి అడ్డుగా నిలుస్తోంది. అసలే పంచాయతీలు నిధులకోసం ఆపసోపాలు పడుతున్నాయి. అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ఇవ్వడానికి తంటాలు పడుతున్నారు. ప్రభుత్వానికి ఇవేమీ పట్టడంలేదు.

అధికార పార్టీలోనే అసంతృప్తి

పంచాయతీలకు ప్రభుత్వం స్టాంపు డ్యూటీ వంటి బకాయిలు చెల్లించకపోవడంతో అధికార పార్టీలోనే తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో నిధులు రాక తమ హయాంలో గ్రామాలను అభివృద్ధి చేశామంటూ చెప్పుకోవడానికి వీలు లేకపోయింది. కొన్నిచోట్ల ఆర్‌బీకేలు, సచివాలయాల నిర్మాణం ప్రారంభించిన మరికొన్నిచోట్ల నిధులు లేక నిలిచిపోయాయి. ఇవన్నీ సర్పంచ్‌లను కుంగదీస్తున్నాయి. ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచుతున్నాయి. కొన్నినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చేస్తాయి. అయినా ప్రభుత్వంలో చలనంలేదు. తమకు కనీస గౌరవం లేకుండా పోయిందంటూ ఇప్పుడు సర్పంచ్‌లు గుర్రుగా ఉన్నారు. పంచాయతీలకు రావాల్సిన నిధులు జమ చేయకపోవడంతో మరింతగా రగిలిపోతున్నారు. ఇలా ప్రభుత్వ చర్యలు అధికార పార్టీలోనే ముసలం తెచ్చిపెట్టాయి. ఇప్పుడు పంచాయతీలకు రావాల్సిన నిధులను ఇవ్వడం లేదు. ప్రభుత్వం అనుమతిస్తేనే పంచాయతీలకు, ఇతర స్థానిక సంస్థలకు నిధులు జమచేస్తారు. అనుమతులు ఇవ్వకుండా ప్రభుత్వం మోకాలడ్డుతుంది.

- స్టాంపు డ్యూటీ అనేది ఒకే ఆస్తి కొనుగోళ్ల లేదా పత్రాలపై విధించబడే పన్ను(చారిత్రాత్మకంగా, చెక్కులు, రశీదులు, సైనిక కమిషన్లు, వివాహ లైసెన్సులు, భూమి లావాదేవీలు వంటి మెజార్టీ చట్టపరమైన పత్రాలతో సహా). పత్రం చట్టబద్ధంగా ప్రభావవంతంగా ఉండకముందే స్టాంపు డ్యూటీ చెల్లిందని చూపించడానికి ఫిజికల్ రెవెన్యూ స్టాంపు జతచేయాలి.
- స్టాంపు డ్యూటీ 1604లో వెనిస్‌లో ఉద్భవించింది. 1610లో స్పెయిన్‌లో, 1620లో స్పానిష్, నెదర్లాండ్స్‌లో, 1651లో ఫ్రాన్స్‌లో, 1694లో ఇంగ్లండ్‌లో ప్రవేశపెట్టారు.



కల్యాణోత్సవానికి రాట ముహూర్తం నిర్వహిస్తున్న అర్చకులు

భీమేశ్వరస్వామివారి కల్యాణ ఏర్పాట్లకు రాట ముహూర్తం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు సోమవారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం జరిపారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 20 నుంచి 26 వరకు జరుగనున్నాయి. దక్షిణ గోపురం వద్ద సోమవారం ఉదయం 8.39 గంటలకు అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, హోమందార్లు వేదమంత్రాలతో ఈవో పీటీవీ సత్యనారాయణ చేతుల మీదుగా రాటమూహూర్తం చేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సప్త నదీ జలాభిషేకం

అయినవిల్లి, ఫిబ్రవరి 12: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో వార్షికంగా నిర్వహించే సప్తనదీ జలాభిషేకం, లక్ష కలముల వితరణ మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతాయని ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు గణపతి పూజ, దీక్షా ప్రారంభం, పుణ్యాహవచనం, పంచగవ్యం, గణపతికల్పము, సప్తనదీజల మండపారాధన, మహాన్యాసం, సప్తనదీ జలాభిషేకాలు, అభిషేకాలు, లక్ష దుర్వార్చన, లక్ష్మీగణపతి అష్ట ద్రవ్య హోమం, నీరాజన మంత్రపుష్పం జరుగుతాయి. బుధవారం గణపతి పూజ, సరస్వతీ కల్పము, సరస్వతీ మండపారాధన, సరస్వతీ మండపారాధన, సరస్వతీ హోమం, కలాలను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహిస్తారు. గురువారం పూజలనంతరం ఈ పెన్నులను పంపిణీ చేస్తారు.



స్వామివారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

స్వామివారి హుండీ ఆదాయం రూ.24,41,574

అంతర్వేది, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. ప్రధాన హుండీ ఆదాయం రూ.23,77,401 రాగా అన్నదాన హుండీ నుంచి రూ.64,173 వచ్చింది. మొత్తం 38 రోజులకు రూ.24,41,574 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, ఈవో బి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బైరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, ఎంపీటీసీలకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయండి

రంగంపేట,ఫిబ్రవరి, 12 రంగంపేట మండలం కోటపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను 2024- 25 విద్యా సంవత్సరానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. లేకుంటే తమ పిల్లలను ఏ స్కూల్‌కి పంపించకుండా చదువు మానిపించేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు సర్పంచ్ గవరసాని లక్ష్మికి, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావులకు సోమవారం వినతిపత్రం అందించారు. దీంతో వారు ఈ విషయం ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని పేరెంట్స్ కమిటీ సభ్యులకు తెలిపారు.

కసాయి తండ్రి!

- పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తండ్రి
- భార్యపై కోపమే కారణం
- భార్య ఫిర్యాదుతో భర్తపై హత్యాయత్నం కేసు
- ఇద్దరు చిన్నారుల పరిస్థితి ఆందోళనకరం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య గొడవలు పిల్లల ప్రాణాల మీదకు తెచ్చాయి. భార్యతో విభేదాల కారణంగా కన్నపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన తండ్రిపై హత్య కేసు నమోదు చేశారు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీకి చెందిన గూడి సాయి కిరణ్‌కి ఎర్రవరానికి చెందిన దుర్గతో ఆరేళ్ల కిందట వివాహమైంది. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఇద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల కొడుకు సందీప్, ఏడాదిన్నర కూతురితో ఆమె అమ్మగారింటికి వెళ్లిపోయింది. గత నెల 21వ తేదీన అత్తగారింటికి వెళ్లిన సాయి గొడవపడి ఇద్దరు పిల్లలను తీసుకొని వచ్చేశాడు. ఏమైందో ఏమోగానీ ఆదివారం అతడి ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన స్థానికులు వెళ్లి చూశారు. ఆ ఇంట్లో అప్పటికే అతడు, పిల్లలు తీవ్రంగా కాలిన గాయాలతోపడి ఉండడం చూసి భయాందోళన చెందారు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయని సాయి చెప్పాడు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో బంధువుల ఇంటి వద్ద ఉన్న పిల్లల తల్లి అక్కడి నుంచి నేరుగా కాకినాడ ఆస్పత్రికి చేరుకుంది. తనపై కోపంతో పిల్లలపై భర్త సాయి పెట్రోలు పోసి నిప్పంటించాడని సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ ఉమర్ తెలిపారు. పిల్లల ఇద్దరు 80 శాతం మేర కాలిపోవడంతో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని బంధువులు చెప్పారు. చిన్నారులు ఇద్దరూ ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. తండ్రి గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు.





విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో, ఇతర అధికారులు.. విద్యార్థులను పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం

52 మంది గురుకుల పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- 8 మందికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స
- కలుషిత ఆహారమే కారణమంటున్న వైద్యులు
- పలువురు ప్రముఖుల పరామర్శ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అదివారపుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 52 మంది సోమవారం అస్వస్థతకు గురయ్యారు. అందులో 8 మందిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషిత ఆహారం తినడం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ గురుకుల పాఠశాలలో 450 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వారిలో కొంతమందికి ఆదివారం రాత్రి వాంతులు, రక్త విరోచనాలు అయ్యాయి. గురుకుల పాఠశాల ఆరోగ్య పర్యవేక్షకుడు విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించాడు. సోమవారం ఉదయం నాటికి అస్వస్థతకు గురైన వారి సంఖ్య 52కు చేరుకుంది. అందులో కొంత మందికి వాంతులతోపాటు రక్త విరోచనాలు అయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య అందుతున్న తీరును పరిశీలించారు.

పీహెచ్‌సీ వైద్య శిబిరం

పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సందీప్ నాయుడు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మణికంఠలు గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పా టుచేశారు. విద్యార్థులను పరీక్షించారు. ప్రాథమిక చికిత్స అందించారు. వాంతులు, రక్త విరోచనాలవుతున్న ఐదుగురితోపాటు మరో 8 మందిని అంబులెన్సులో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డాక్టర్ వీరభద్రుడు, పిల్లల వైద్యులు విద్యార్థులకు చికిత్స అందచేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ సంజీవరావు, సంయుక్త కార్యదర్శి, ఇతర అధికారులు ఆసుపత్రిలో విద్యార్థులకు అందుతున్న చికిత్సను పరిశీలించారు. అందించిన చికిత్స వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి తీసుకున్న ఆహారం, అస్వస్థత ఎలా గురయ్యారని అడిగి తెలుసుకున్నారు. అలాగే టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు. చికిత్స వివరాలు అడిగారు.

కలుషిత ఆహారమే కారణం

విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ కావడం వల్లే అస్వస్థతకు గురయ్యారని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం స్థిరంగా ఉందని, మంగళవారం ఉదయం డిశ్చార్జి చేయవచ్చని తెలిపారు. రెండో శనివారం పేరెంట్స్‌డే కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులు తీసుకువచ్చిన మాంసాహారం భుజించారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా పూరి, మధ్యాహ్నం చికెన్ బిర్యానీ ఆహారంగా తీసుకున్నారు. ఆహారం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తేల్చారు.





బకెట్‌తో ఓఆర్ఎస్ అందిస్తున్న దృశ్యం.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కమిటీ వేసి నిర్ధారించాలి..

రామచంద్రపురం, ఫిబ్రవరి 12: ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ అదృష్టవశాత్తు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని, ఘటనకు కారణమేమిటో కమిటీ వేసి నిర్ధారించాలని, బాధ్యుడైన హాస్టల్ వార్డెన్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ విద్యార్థులను పరామర్శించారు. జనసేన, టీడీపీ, వైసీపీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం

అమలాపురంటౌన్, ఫిబ్రవరి12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం హైస్కూలు సెంటర్లో నిరసన తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ నమూనా ప్రతులను దహనం చేశారు. అప్రంటీస్ విధానాన్ని రద్దుచేస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. జిల్లా కార్యదర్శులు పి.మురుగేశ్వరరావు, పెన్నాడ శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బీఎస్ వెంకటేశ్వరరావు, సత్తార్, రేణుకాప్రసాద్, తోరం బాలాజీ, ఈశ్వరరావు, సత్యనారాయణ, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.





చేబ్రోలులో చోరీకి ప్రయత్నించిన దృశ్యం.. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

పట్టపగలు చోరీకి ప్రయత్నం.. దొంగకు దేహశుద్ధి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 12: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టపగలు చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి తిరగబడటానికి ప్రయత్నించడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామంలోని ఈబీసీ కాలనీ వద్ద గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నివాసముంటున్న బొమ్మిడాల కామేశ్వరరావు తన ఇంటికి తాళం వేసుకుని బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఇంటి తాళాలు, తలుపులను బద్దలు కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన పక్కింటి వారు పట్టుకోవడానికి ప్రయత్నించగా హరేరామ గుడి వరకూ పరారయ్యాడు. అక్కడ స్థానికులు పట్టుకోగా వారిపై తిరగబడ్డాడు. దీంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గొల్లప్రోలు పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.



బైరవపాలెం సమీపంలో నడి సముద్రంలో అగ్నిప్రమాదంలో చిక్కుకున్న బోటు

బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

• నడి సముద్రంలో బుగ్గి • సురక్షితంగా బయటపడ్డ 11 మంది జాలర్లు

ఉప్పాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 12: నడి సముద్రంలో బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఆయిల్ ట్యాంక్ పేలిన సంఘటనలో బోటు పూర్తిగా దగ్ధమైందని ఉప్పాడ మత్స్యకార నాయకుడు, గ్రామ సర్పంచ్ ఉమ్మిడి జాన్ తెలిపారు. సూరాడపేటకు చెందిన సూరాడ కృష్ణ ఇంజన్ బోటుపై అదే పేటకు చెందిన 11 మంది మత్స్యకారులు సోమవారం తెల్లవారుజామున నడిసముద్రంలోకి చేపల వేటకు బయలుదేరారు. ఉప్పాడ తీరం నుంచి సముద్రం భైరవపాలెం వైపునకు వేట చేస్తూ వెళ్లారు. మధ్యాహ్నం భోజనం తయారు చేసుకొనేందుకు బోటులోనే వంట చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించారు. అప్పటికే లీకై ఉన్న గ్యాస్ స్టౌ వెలిగించిన క్షణాల్లో పక్కనే బోటు డీజిల్ ట్యాంక్ అంటుకోవడం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బోటులో ఉన్న మత్స్యకారులు హాహాకారాలు చేస్తుండడాన్ని గుర్తించిన సహచర మత్స్యకారులు వారిని వేరే బోటులో ఎక్కించి రక్షించారని సర్పంచ్ జాన్ తెలిపారు. మత్స్యకారులంతా సురక్షితంగా బయటపడగా, ఈ ప్రమాదంలో వేటాడిన చేపలు, వలలు, బోటు పూర్తిగా కాలిపోవడంతో రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



మోతుగూడెం, ఫిబ్రవరి 12: మల్లారం గ్రామంలో జీలుగకల్లు తీయడానికి చెట్టు ఎక్కిన వ్యక్తి కాలుజారి కిందపడడంతో మృతి చెందాడు. ఎం.రామసుందరం (30) ఆదివారం రాత్రి జీలుగకల్లు తీయడానికి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో భార్య గురుహరి చెట్టు వద్దకు వెళ్లి చూసింది. కింద పడి ఉన్న భర్తను చూసి చుట్టుపక్కల వారిని అక్కడికి తీసుకెళ్లింది. వారు రామసుందరాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసును మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామసుందరంనకు ముగ్గురు ఆడపిల్లలు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు

అప్పులబాధ తాళలేక కుటుంబం ఆత్మహత్యాయత్నం

యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

యానాం, ఫిబ్రవరి 12: అప్పుల బాధ తాళలేక లేక యానాంలో ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన సెల్ఫీ వీడియో బయటకు రావడంతో స్థానికులు హుటాహుటిన ఇంటికి వెళ్లి వారిని యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసుతం యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది. స్థానిక దంగేటివారి వీధిలోని అద్దె ఇంట్లో నివశిస్తున్న డేగల సునీత తన ఇద్దరు కుమారులతో కలిసి చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన భర్త శ్రీను కొత్తపేటకు చెందిన పోశారావు దగ్గర రూ.15 వేలు తీసుకున్న అప్పు కట్టినప్పటికీ వడ్డీ పేరుతో మళ్లీ కట్టాలని వేధించారన్నారు. అయితే రూ.30 వేలు కట్టినప్పటికి అనంతరం రూ.1.50 లక్షలకు కోర్టు నుంచి నోటీసు పంపడంతో ఒత్తిడి భరించలేక తాగుడుకు బానిసై తన భర్త మృతి చెందడం జరిగిందన్నారు. తన భర్త చనిపోయి నెల గడవకముందే అప్పు చెల్లించాలని పోశారావు ఒత్తిడి తేవడం తన కుమారులు శ్రీరాజు, తేజలను వేధించడంతో ఏమీచేయలేని నిస్సహాయస్థితితో ఉన్న తాము చనిపోవాలని నిర్ణయించుకుని సెల్ఫీ వీడియో తీసుకుని చీమల మందు తాగారు. ఈ వీడియో చూసిన కుటుంబసభ్యులు, స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.



కిడ్నీ వ్యాధిగ్రస్త బాలుని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న ఎంఈవోలు, ఎడ్యుకేర్ స్కూలు కరస్పాండెంట్ తదితరులు

ఎడ్యుకేర్ విద్యార్థుల ఔదార్యం

వైద్య అవసరాల కోసం బాలునికి రూ.10 లక్షల ఆర్థిక సాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 12: నగరం ఎడ్యుకేర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 8వ తరగతి చదువుతున్న బళ్ల రామ్‌మోహన్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాలుడిని వైద్యులకు చూపించగా రెండు కిడ్నీలు పాడైపోయాయని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనలో పడ్డారు. ప్రతీ రెండు రోజులకు డయాలసిస్ చేస్తున్నప్పటికీ వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని, దానికి రూ.15 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎడ్యుకేర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మురార్జీ సూచన మేరకు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు విరాళాలుగా రూ.10 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎంఈవోలు సీహెచ్ లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు బాలుని కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. సహ విద్యార్థిని ఆదుకోవడానికి ముందుకొచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంఈవోలు అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కె.మురార్జీ, డైరెక్టర్ కె.సత్యవాణి, ప్రిన్సిపాల్ భాస్కర శ్రీనులు పాల్గొన్నారు.



మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలకోసం నిరీక్షించిన దృశ్యం

వైద్యం కోసం బిడ్డతో బాలింత నిరీక్షణ

జనసైనికుల స్పందనతో కాకినాడ తరలింపు

మండపేట, ఫిబ్రవరి 12: మండపేట ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన గిరిజన మహిళ నాలుగు గంటలు వైద్యుల కోసం నిరీక్షించినా స్పందన లేదు. దీంతో జనసైనికులు బాలింతను బిడ్డను 108లో కాకినాడకు తరలించి ప్రాణాలను కాపాడారు. విశాఖ జిల్లా కాకరపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ మర్రికాంతమ్మ కుటుంబంతో పొట్టకూటి కోసం కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి వచ్చింది. ఆమె ఆదివారం తాపేశ్వరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడే బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెను వైద్యం కోసం బంధువులు కేశవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో సోమవారం మండపేట ఆసుపత్రికి బిడ్డతో బాలింత వచ్చింది. నాలుగు గంటలు నిరీక్షించినా అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. దీంతో జనసైనికులు స్పందించి ఆమెను, బిడ్డను 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. జనసేన మను కృష్ణ, ఇప్పనపాడు ఉపసర్పంచ్ కుంచే దుర్గాప్రసాద్ మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



గోల్డ్ మెడల్‌తో నాగిరెడ్డి

వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయుడు

ఎటపాక, ఫిబ్రవరి12: అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సోడి నాగిరెడ్డి వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణలోని హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 5వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో నాగిరెడ్డి షాట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్, జావలిన్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. దాంతో నాగిరెడ్డి వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఇతర దేశంలో జరగనున్న పోటీల్లో నాగిరెడ్డి పాల్గొననున్నారు. దీంతో నాగిరెడ్డిని విలీన మండలాల్లోని అనేక మంది ఉపాధ్యాయులు అభినందించారు.

జనసేనలో 150 కుటుంబాలు చేరిక

ఎటపాక, ఫిబ్రవరి12 ఎటపాక మండలం కన్నాయిగూడెంలోని శ్రీరామ్ నగర్‌కాలనీలో సుమారు 150 కుటుంబాలు సోమవారం జనసేన పార్టీలో చేరాయి. ఆ పార్టీ మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారాసు గంగాధర్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారంతా తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం జనసేన మండల అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, జనసేన సీనియర్ నాయకులు పయ్యవుల నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు బండారి భద్రరావు, కొమ్ము మహేష్, కొమ్ము వినయ్, సూరిశెట్టి సురేష్, డేగల మరళి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 93 బీసీ కులాల ఐక్యవేదిక మహాసభ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 12: త్వరలో ఆంధ్రాలో 93 బీసీ కులాల ఐక్యవేదిక మహాసభ పెట్టడానికి జాతీయ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్‌తో చర్చించి ఆంధ్ర రాష్ట్ర 93 బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్,గణేష్‌బాబు తెలిపారు. కాకినాడ జిల్లాలో ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో ముందుకొస్తామని, అన్నిపార్టీలకు ఎన్నికల్లో బీసీల తడాఖా చూపిస్తామని, అతి త్వరలో బీసీల బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 12: వేతన సవరణ సంఘం నివేదిక వచ్చేందుకు సమయం పట్టే అవకాశమున్నందున 2023 జూలై 1 నుంచి వర్తింపచేసే విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను డిమాండ్ చేశారు. పిఠాపురం బాదం వారి సత్రంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు డి.మణికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవులు, మెడిక్లెయిమ్‌లకు సంబంధించిన బకాయిలను తక్షణం విడుదల చేయాలన్నారు. ప్లస్ టూ పాఠశాలల్లో పనిచేస్తున్న పీజీటీ ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని, ప్రధానోపాధ్యాయులకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, డీవైఈవో-2 పోస్టులకు విధివిదానాలను రూపకల్పన చేయాలని, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62ఏళ్లకు పెంచాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సాయికృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'నష్టం చేకూర్చే చట్టాన్ని రద్దు చేయాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: రవాణా కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులో సోమవారం ఆల్ ఇండియా రవాణా యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రవాణా యూనియన్‌కు అన్ని విధంగా నష్టం చేకూర్చే ఈ చట్టాన్ని రాష్ట్రానికి వైసీపీ నాయకులు ఆమోదం తెలపడం దారుణమన్నారు. ఈ బిల్లు రద్దు కోసం ఈనెల 16న రవాణా వర్కర్ల భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రొంగల ఈశ్వరరావు, మెట్ల శ్రీను, బి.శ్రీనుబాబు, ఎం.బాబ్జి, కె.సత్తిబాబు, జి.మురళి, సత్యనారాయణ, వసంత్‌కుమార్, హేమలత పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం'

తుని రూరల్, ఫిబ్రవరి 12: టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామంటూ తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్.అన్నవరం పంచాయతీ శివారు గెడ్ల బీడులో టీడీపీ నేత యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో ప్రజలకు పార్టీ మేనిఫెస్టో పత్రాలు అందజేసి టీడీపీ, జనసేన భవిష్యత్తులో చేపట్టేబోయే కార్యక్రమాలు వివరించారు. తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, జక్కన రామనాయుడు, చింతమనీడి నాగ సోమరాజు ఉన్నారు.

'సమస్యను పరిష్కరించాలి'

తాళ్లరేవు, ఫిబ్రవరి 12: స్థానికంగా పట్టాలివ్వాలని లబ్ధిదారులు చేస్తున్న నిరసన దీక్షను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని టీడీపీనేత టేకుమూడి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, గ్రే లక్ష్మీనారాయణ నిరసనకారులకు మద్దతు తెలిపారు. టేకుమూడి మాట్లాడుతూ చొల్లంగిలో స్థానికంగా ఉన్న భూమిని వేరే మండలానికి ఇచ్చి స్థానికులకు అన్యాయం చేస్తే ప్రతిపక్షంగా ఊరుకోమన్నారు. లబ్ధిదారులకు అండగా నిలబడి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మేడపాటి దేవానందం, పులపకూర చినబాబు, కనకాల పెదబాబు, కొంకి రాజు, బొంతు వెంకటరమణ పాల్గొన్నారు.

'వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి'

రౌతులపూడి, ఫిబ్రవరి 12: మంచినీటి కోసం కోటి పది లక్షలతో నిధులు మంజూరు చేసిన వాటర్ ట్యాంక్ నిర్మాణం ఎస్సీకాలనీలో చేపట్టాలని మాల మహానాడు జాతీయ కమిటీ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎస్సీకాలనీ ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ అధికారులు సర్వేచేయాలని డిప్యూటీ తహశీల్దార్ టీవీవీ.సత్యనారాయణకు వినతి అందజేశారు. మాలమహానాడు జిల్లా కోఆర్డినేటర్ చిట్టూమూరి గోవిందు, నేతల కొండబాబు, నొక్కు రామకృష్ణ పాల్గొన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, ఫిబ్రవరి 12: స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతీ సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించే అన్న క్యాంటీన్‌లో గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటకు చెందిన కురుకూరి సీతారామకృష్ణ కుమారుడు నీలాద్రిరావు పేట టీడీపీ అధ్యక్షుడు కురుకూరి వీర వెంకట చౌదరి, రమేష్‌ల ఆర్థిక సాయంతో భోజనాలు నిర్వహించారు. టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, కందుల చిట్టిబాబు, జీను మణిబాబు పేదలకు వడ్డించారు. కొత్త కొండబాబు, కందుల విజయ్, సుంకవిల్లి రాజు, కందుల వినయ్, కందుల జమ్మి, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ, పాలచర్ల సత్యనారాయణ, కంటిపూడి రామారావు, కందుల గంగాధర్, పరిమి సత్తిబాబు, సోనిబోయిన అప్పారావు, సోడసాని ధర్మరాజు, కట్టు అప్పారావు, పి.సూర్యనారాయణరాజు, కారుకొండ శ్రీను ఉన్నారు.

ఆసరా పథకం చెక్కు పంపిణీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 12: కాకినాడ జేఎన్‌టీయూకే ఎదురుగా గల మున్సిపల్ గ్రౌండ్‌లో కాకినాడ రూరల్ మండలంకు చెందిన 2801 సంఘాల్లో గల 28,010 మంది సభ్యులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ. 22.99 కోట్లు, 1,2,3 అర్బన్‌కు చెందిన 496 సంఘాల్లో 5010 మంది సభ్యులకు రూ.3కోట్లు చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జి, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, ఆర్డీవో ఇట్ల కిషోర్, ఎస్సీ కార్పొరేషన్, సివిల్ సప్లయిస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు జంగా గగారిన్, జమ్మలమడక నాగమణి, లింగం రవి, ఇన్‌చార్జి ఏపీఎం దేవి, సీసీ ఎం.సురేష్‌కుమార్, వడ్డి మణికుమార్ పాల్గొన్నారు.

రామచంద్రపురంలో జ్యోతుల నవీన్ ప్రచారం

కిర్లంపూడి, ఫిబ్రవరి 12: ప్రతి ఇంటికి మీ నవీన్‌కుమార్ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం గ్రామంలో సోమవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పర్యటించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు అధ్యక్షతన కంచుమర్తి రాఘవ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ రాబోయే టీడీపీ, జనసేన కూటమి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కంచుమర్తి రామలక్ష్మి, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, పట్టుగంగాధర్, టీడీపీ నాయకులు నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, పాఠంశెట్టి మురళీకృష్ణ, కొండబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, ఆళ్ళ నానాజీ, కె.వెంకటేశ్వరరావు, సూరిబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో టీడీపీ కార్యకర్తల సమావేశం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: ఏలేశ్వరం నగర పంచాయతీ 18వ వార్డులో సోమవారం సాయంత్ర టీడీపీ పట్టణాధ్యక్షుడు సతివాడ రాజు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏలేశ్వరంలో టీడీపీ ఆవిర్భావం నుంచి పని చేసున్న కార్యకర్తలను విస్మరించి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సత్యప్రభ టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన వైసీపీ వాళ్లతో కలియతిరగడం దారుణమని పలువురు పేర్కొన్నారు. రాయుడు చిన్న, సూరిబాబు, విజయ్,ముచ్చి అప్పలరాజు, నిమ్మకాయల నారాయణ, వాగురమేష్, రొట్ల వీర్రాజు, పైలా అయ్యప్ప,చింతల పాండవులు ఉన్నారు.

టి.రాయవరంలో 'బీజేపీ పల్లెకు పోదాం'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: టి.రాయవరంలో సోమవారం బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు 86వ పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షురాలు తటవర్తి మంగాదేవి నాయకత్వంలో బీజేపీ కార్యకర్తలు ప్రజలకు కరపత్రాలు, క్యాలెండర్‌లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు మదినే బాబ్జి, సూరంపూడి రామకృష్ణ, పెద్దకాపు, మొక్కపాటి సత్యనారాయణ, రాయి మాధవ ఉన్నారు.

ఐద్వా మహిళా కార్యకర్తల ఆందోళన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్‌లో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో అఖిల భారత మహిళా సంఘం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. దేశంలో విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేదని, మహిళలకు రక్షణ కరువైందని మోసపూరిత నారీ వందన్ వద్దు, సమానత్వం, అధికారం కావాలంటూ నినాదాలు చేశారు. లిబరేషన్ నేత ఏగుపాటి అర్జునరావు, ఐద్వా మహిళా సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

తిరుమల	:	యాత్ర 2
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజీబ్యాండు
సత్యగౌరి	:	లాల్‌సలామ్
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	లాల్‌సలామ్

రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని మృతదేహం

సామర్లకోట, ఫిబ్రవరి 12: సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గూడపర్తి రైల్వే స్టేషన్ సమీపాన పట్టాల వద్ద సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని పురుష మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. గూడపర్తి ట్రాక్‌మెన్ అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ పి.అనంతలక్ష్మి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. మృతదేహంపై నల్లరంగు షార్ట్ మాత్రమే ఉంది.కేసు నమోదు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు


ప్రత్తిపాడు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణుడు


తుని: టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: ప్రత్తిపాడు మండలం వైసీపీ నాయకుడు, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ప్రధాన అనుచరుడు, లంపకలోవ సొసైటీ మాజీ అధ్యక్షుడు గొంతిన సురేష్ వైసీపీకి రాజీనామా చేశారు. సోమవారం ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా సమక్షంలో తునిలో రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలోకి చేశారు. గొంతిన సురేష్‌తో పాటు ప్రత్తిపాడు మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ గంటా సత్తిబాబు టీడీపీలోకి చేరారు. వారికి రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు, కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండలాధ్యక్షుడు అమరాది వెంకట్రావు, నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, ఆనంద న్యూటన్, గీదా నానాజీ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు: గొల్లప్రోలులో దేవీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన 100మందికి పైగా వివిధ పార్టీల నుంచి టీడీపీలో చేరారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ వారందరికి వర్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ గొల్లప్రోలు పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, గంటా చంద్రరావు, బస్వా సత్యనారాయణ, కడారి బాబ్జి, పేకేటి చక్రధరరావు, నాగేశ్వరరావు, దువ్వా తాతాజీ, పర్వత సురేష్, గండే నాగేశ్వరరావు, వెన్నా బాపిరాజు, బస్వా నాగేశ్వరరావు, రమణ, నాగమల్లి త్రిమూర్తులు, గిడుతూరి బాబూరావు, బస్వా రాజబాబు పాల్గొన్నారు.

తునిలో...

తుని రూరల్, ఫిబ్రవరి 12: తుని టీడీపీ కార్యాలయంలో కోటనందూరు మండలం కేవో అగ్రహారం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చిట్టుమూరి వెంకట శివ, కాళ్ళ భద్ర, ఏలేటి రాజా, ఏలేటి శివతో పాటు పలు కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కోటనందూరు టీడీపీ మండలాధ్యక్షులు గాడి రాజబాబు, నాయకులు మిరియాల సత్యనారాయణ, యలమంచిలి చంటిబాబు, బంగారు అప్పలనాయుడు, జి.సతీష్, కాపారపు లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాటికాపరికి జీతం ఇవ్వలేమా?

వాడీవేడిగా పెద్దాపురం కౌన్సిల్ సమావేశం


సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

పెద్దాపురం, ఫిబ్రవరి 12: కాటికాపరికి జీతం కూడా ఇవ్వలేని దీనస్థితిలో ఉన్నామా..? సుమారు 10 నెలలుగా వేతనం చెల్లించకపోవడం దారుణమని కౌన్సిల్ కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశపు మందిరంలో అత్యవసర సమావేశాన్ని చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పట్టణ పరిధిలో 5వ వార్డులో ఉన్న శ్మశాన వాటికలో పనిచేసే కాటికాపరికి వేతనం చెల్లించకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. అలాగే పెద్దాపురం-జగ్గంపేట ప్రధాన రహదారిలో ఉన్న శాతాబ్ది పార్కు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్‌లను వేగవంతం చేయాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని, తమ వార్డులో పనులు ఇంకా పూర్తికాకపోవడమేంటని ప్రశ్నించారు. కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవరావు మాట్లాడుతూ ఏలేరు కాలువలో వ్యర్థాలను డంపింగ్ చేసేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు తమ వార్డుల్లో సమస్యలపై ప్రశ్నించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ కేవీ.పద్మావతి, డీఈ ఆదినారాయణ, మేనేజర్ జ్యోతీరాణీ, ఏఈ జీవప్రసాద్, ఆర్వో చంద్రశేఖర్, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, ఫిబ్రవరి 12: కొత్తపల్లి మండల సర్వసభ్య సమాశం సోమవారం మొక్కుబడిగా జరిగింది. ఉదయం 10 గంటలకు జరగాల్సిన సమావేశం ఆలస్యంగా ప్రారంభమై త్వరగా ముగించేశారు. ఎంపీపీ కారే సుధాశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమాశంలో కొండెవరం ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు మాట్లాడుతూ పీబీసీ ఆయకట్టుకింద ఏలేరు సాగునీరందక పోవడంతో దాళ్వా పంటలు ఎండిపోతున్నాయని, ఏలేరు నుంచి సాగునీరందించాలని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశం ముగించేసే సమయానికి కాకినాడ ఎంపీగా వంగా గీత హాజరయ్యారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరును నిరంతరంగా సరఫరా చేయాలని ఇరిగేషన్ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మాదిరెడ్డి దొరబాబు, ఎంపీడీవో పి.వెంకటనారాయణ, మండల ఇంజనీరింగ్ అధికారి గరగ శ్రీనివాసరావు ఉన్నారు.

వలసపాకలలో 'జనం కోసం పవన్'


ప్రచారం నిర్వహిస్తున్న పంతం నానాజీ

కరప, ఫిబ్రవరి 12: మండలంలోని వలసపాకల గ్రామంలో జనం కోసం పవన్ - పవన్ కోసం మనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పంతం నానాజీ, టీడీపీ నేత చప్పిడి వెంకటేశ్వరరావు ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలో మురుగునీటి వ్యవస్థ దారుణంగా ఉందని విమర్శించారు. కాల్వగట్టపై ఉన్న 4ఎకరాల స్థలాన్ని జడ్పీటీసీ తన లేవుట్‌లో కలిపేసుకున్నారని విమర్శించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎమ్మెల్యే ఒత్తిడితో వారు మాట్లాడడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో దేవు వెంకన్న, రంగారావున, చినరమణ పాల్గొన్నారు.

'నాణ్యమైన పరిష్కారం అందిస్తాం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 12: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతీఒక్క సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, వివిధ విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు సంబంధించి డయల్ యువర్ కమిషనర్‌కు 9, స్పందనకు 4 దరఖాస్తులు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ ధర్నా

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 12: గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో దళితులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసుస్టేషన్ వద్ద సోమవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కేసును నీరుగార్చేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి ఖండవిల్లి లోవరాజు ఆరోపించారు.



చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం సుభిక్షం

మాజీ ఎమ్మెల్యే కొండబాబు


సభలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12: జగన్‌రెడ్డి అరాచక పాలనతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అభాసుపాలైందని, చంద్రబాబు పాలనతోనే ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సారథ్యంలో టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక జగన్నాథపురం 20వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ వద్ద టీడీపీ నగర బీసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం జయహో బీసీ సభ నిర్వహించారు. కొండబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయంలో చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే.. జగన్‌రెడ్డి తన అరాచకాన్ని, విధ్వంసాన్ని అభివృద్ధి చేశాడన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అలజడులు సృష్టించారని, అన్ని వర్గాల ప్రజలు, మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌గా కీర్తి గడించిన రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి గంజాయి కేంద్రంగా మార్చేశాడన్నారు. వైసీపీ పాలనలో అధ:పాతాళానికి పోయిన ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైసీపీ అభ్యర్థులను మార్చిన మాదిరిగానే జగన్‌రెడ్డిని మార్చడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం రాబోతుందన్నారు. డివిజన్ వైసీపీ నాయకుడు ఆకుల దుర్గాప్రసాద్ తన అనుచరులు 200 మందితో టీడీపీలో చేరారు. వారికి కొండబాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు కొల్లుబోయిన శ్రీనివాస్, వనపత్రి బద్రి, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుత్తుల రమణ, దండుప్రోలు నాగబాబు, ఏవీడీ మెంటారావు, పలివెల రవి, మేడిశెట్టి చిన్ని, గొరుసు వెంకట దుర్గారావు, పసగడుగుల శేషగిరిరావు, ఎస్కే రహీమ్, గుజ్జు బాబు, పంతాడి రాజు, సంగాని నాగేశ్వరరావు, పాలిక నాని, తుమ్మల సునీత, పీర్ల లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు నీరందించడంలో విఫలం

మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం


పొలాలను పరిశీలిస్తున్న వర్మ

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 12: దాళ్వా సాగుకు నీరందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామంలో సాగునీరందక ఎండిపోతున్న పంటపొలాలను ఆయన రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. మండలంలోని పి.దొంతమూరు, వెల్దుర్తి, పి.తిమ్మాపురం, పి.రాయవరం, రాపర్తి, బోగాపురం, బి.ప్రత్తిపాడు తదితర గ్రామాలు, గొల్లప్రోలు మండలంలోని గొల్లప్రోలు, లక్ష్మీపురం, సీతానగరం, మల్లవరం తదితర గ్రామాలు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటకు సాగునీరందక పొలాలు బీటలు వారుతున్నాయని తెలిపారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు పంటపొలాలుకు చేరడం లేదన్నారు. టీడీపీ హయాంలో ఇటువంటి పరిస్థితుల నుంచి రైతులను కాపాడి పుష్కలంగా సాగునీరందించేందుకు రూ.1650కోట్లుతో పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి గోదావరి జలాలను ఏలేరు ఆయకట్టుకు మళ్లించామని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు చెల్లించకుండా పథకాన్ని నిరుపయోగంగా మార్చిందని విమర్శించారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నియోజకవర్గంలోని పంటపొలాలకు అందేలా చూడాలని జిల్లా కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, వెంకట్, సర్పంచ్ దత్తుడు, ఎంపీటీసీ సత్తిబాబు, పోకనాటి వీరబాబు, ఉలిశెట్టి ఆనంద్, వినుకొండ రంగారావు ఉన్నారు.

'వరి పంటకు సాగునీరివ్వాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12: పి.దొంతమూరు చెరువు నుంచి తమ పొలాలకు పంట కాలువ ద్వారా రావాల్సిన నీటిని నిలిపివేయడంతో రబీలో వేసిన వరి నాట్లు ఎండిపోతున్నాయని పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామం రైతులు సోమవారం కాకినాడలో జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని 180 ఎకరాల్లో 25 రోజుల క్రితం వేసిన వరి నాట్లు సాగునీరందక ఎండిపోతున్నాయన్నారు. అధికారులు సత్వరం చర్యలు తీసుకుని వరి పంటకు తమ పొలాలకు సాగునీరు అందేలా చూడాలని ఆ గ్రామ రైతులు కోరారు.

అంగన్‌వాడీ సహాయకుల భర్తీకి నోటిఫికేషన్

సీడీపీవో లక్ష్మి

కరప, ఫిబ్రవరి 12: ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని కరప మండలంలోని అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు సీడీపీవో వై.లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పెదకొత్తూరు బీసీటీ, వేళంగి ఓసీ జనరల్‌కు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా గ్రామాలలో నివసిస్తూ వివాహితులై ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వయస్సు 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. అర్హులైన వారు కాకినాడ రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని, అదే కార్యాలయంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 7గంటల లోపు దరఖాస్తు చేయాలన్నారు. సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని ఆమె తెలిపారు.

తొండంగిలో...

తొండంగి: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత తెలిపారు. పి.అగ్రహారం, కృష్ణాపురం, పిఇ.చిన్నయ్యపాలెంతో పాటు తుని మండలం రాపాకలో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఆయా గ్రామాలకు చెందిన 21 ఏళ్ల ఉన్న వివాహిత మహిళలు అర్హులన్నారు. ఈనెల 22లోగా దరఖాస్తులను తుని ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని ఆమె కోరారు.

'మా స్థలాలను కబ్జా నుంచి కాపాడాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12: కాకినాడ చీడీలపోర ప్రాంతంలోని తమ స్థలాలను కబ్జా నుంచి కాపాడాలని స్థలాల యజమానులు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో వారు మాట్లాడుతూ.. కాకినాడ మున్సిపల్ ఏరియాలో వార్డు నంబర్, బ్లాక్ నంబర్ 67 సూర్యారావుపేట పేట తాలూకు సర్వే నంబర్ 199/1/3,186/1/1లో గల స్థలాలకు తాము 11 మంది సంపూర్ణ హక్కుదారులమన్నారు. 1997 నుంచి రిజిష్టర్ డాక్యుమెంట్లు గల తమ స్థలాలను 2023 జూలైలో కొందరు టిప్పర్లతో గ్రావెల్ ఫిల్లింగ్ చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ఓ.ఎస్.నంబర్ 732/2023 గా కేసు వేయగా ఇంజంక్షన్ ఆర్డర్ మంజూ రు చేశారన్నారు. దీంతో తమ స్థలాల్లో 3 వంతుల భాగం గ్రావెల్ ఫిల్లింగ్ చేసుకున్నా మన్నారు. ఇదిలాఉండగా ఈనెల 5న రాత్రి సమయంలో కొందరు తమ స్థలాల్లోని పెన్సింగ్ కూల్చివేసి అక్రమంగా గ్రావెల్ ఫిల్లింగ్ చేశారన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

'స్థలాలు చూపకుండా రిజిస్ట్రేషన్ ఎలా'

సామర్లకోట, ఫిబ్రవరి 12: మండలంలోని వెంకటకృష్ణ రాయపురంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మూడేళ్లు కావస్తున్నా నేటికి ఇళ్ల స్థలాలు చూపకుండా తాజాగా రిజిస్ట్రేషన్ అంటూ తమను ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలకు తిప్పడం వల్ల ఏ ఫలితం ఉందని పలువురు లబ్ధిదారులు సోమవారం సామర్లకోట రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. రోడ్డు మార్గం, రవాణా సదుపాయాలు లేని లేఅవుట్ ఎంత మాత్రం వినియోగంకాదన్నారు. తమకు వేరొక చోట ఇళ్లు నిర్మించుకునేందుకు యోగ్యమైన స్థలాన్ని చూపాలని, అప్పుడే రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తే అందుకు అంగీకరిస్తామని లబ్ధిదారులు వారికి స్పష్టం చేశారు.

డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

తుని రూరల్, ఫిబ్రవరి 12: స్థానిక ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేస్ డిగ్రీ కళాశాలలో న్యూఢిల్లీకి సైస్టోపిక్ లేబరేటరీస్ నిర్వాహకులు డ్రగ్ సేల్స్, మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సంస్థకు చెందిన సేల్స్ మేనేజర్ ఎం.వెంకటరమణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: తమిళనాడులో అరుణాచల గిరి ప్రదర్శన యాత్రకు ఏలేశ్వరం డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. 4రోజులు యాత్రగా అల్ట్రాడీలక్స్ బస్సును ఈనెల 22న ఏలేశ్వరం నుంచి బయల్దేరి కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారకాతిరుమల తిరిగి 25న ఏలేశ్వరం చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం టిక్కెట్ ధర రూ.3450 నిర్ణయించామన్నారు. ప్రతి పౌర్ణమికి భక్తులు కోరిన సమయంలో బస్సులు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని. వివరాలకు 99592 25532నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 12: నాలుగో ఇన్విటేషనల్ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో కాకినాడలోని బ్లూస్టార్ షాటోకాన్ కరాటే డూ అసోసియేషన్ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. ఆదివారం అమలాపురంలో జరిగిన పోటీల్లో కాకినాడ నుంచి 17మంది పాల్గొన్నారు. సార్పింగ్ విభాగంలో వి.ధర్మ, ఎం.భరత్‌సాయిప్రకాష్, ఆర్.అభి, ఓ.అనిల్, ఒ.సాయిధర్మ, పి.బ్రహ్మానందం, ఎన్.దేవచరణ్, వి.జయరాం, ఎస్‌వీబీ గణపతి, మహేశ్వర్ పాల్గొన్నారు. సార్పింగ్ రెండో విభాగంలో ఎన్.రాజేష్, ఎస్.కార్తికేయ, ఒ.అభి, ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు. కటా విభాగం మొదటిస్థానంలో కె.విశ్వకళ, ఎన్ రాధిక గాయత్రి, కె.కీర్తి పతకాలు సాధించారు. వారిని ఇన్‌స్ట్రక్టర్ డీఆర్ఎం కృష్ణ అభినందించారు.

ఇర్రిపాకలో ప్రత్యేక పూజలు

జగ్గంపేట, ఫిబ్రవరి 12: ఇర్రిపాక శివాలయం వద్ద జ్యోతుల నెహ్రూ, జ్యోతుల మణి కుటుంబం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ ఆదివారం అంకురార్పణ చేశారు. సోమవారం మండప పూజ, గోపూజ, క్షీరాదివాసం పూజలు నిర్వహించారు. 13న ఆదివాసాలు, 14న ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ జరుగుతుందని నెహ్రూ తెలిపారు. ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ, అడబాల భాస్కరావు, జ్యోతుల లక్ష్మీదేవి, జ్యోతుల అనీష్ నెహ్రూ, సుంకవిల్లి రాజు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లికి కుంకుమార్చనలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: ప్రత్తిపాడులోని సత్తెమ్మత ల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి విరిచి ఆకు దంచే కార్యక్రమాన్ని మహిళలు చేపట్టి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అలాగే రాచపల్లి అరుణాచలేశ్వర స్వామిని మాఘ సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలు చేసి అభిషేకాలు,హార తులు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నిరసన

రౌతులపూడి, ఫిబ్రవరి 12: డీఎస్సీ 2024 విడుదలలో అప్రెంటీస్ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించడాన్ని నిరసిస్తూ నోటిఫికేషన్ కాపీల జీవోను మండల యూటీఎఫ్ శాఖ దగ్ధం చేసింది. నాలుగున్నరేళ్ల డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోగా సుమారు 18ఏళ్లు పోరాటం చేసి సాధించుకున్న అప్రెంటీస్ రద్దును ఇప్పుడు డీఎస్సీలో పునరుద్ధరించడం అన్యాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

తుని రూరల్, ఫిబ్రవరి 12: స్థానిక బాలాజీ రోడ్డులో అగ్రవాల్ ఐ హాస్పటల్ ధనలక్ష్మి జూయలరీ సంయుక్తంగా విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యులు అనుసూరి నాగేశ్వరరావు 480 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 100 మందికి కళ్లజోళ్లు అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సూకరత్నం తదితరులున్నారు.

భవితా కేంద్రానికి ప్రింటర్ అందజేత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని ధర్మవరం హైస్కూల్లో నిర్వహిస్తున్న భవితా కేంద్రానికి సోమవారం ఆ గ్రామ ప్రముఖుడు జువ్వల గనిబాబు, రూ.6వేలు విలువ చేసే ప్రింటర్‌ను అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.చినరామమూర్తి చేతులమీదుగా అందజేశారు. గతంలో రూ.5వేలు విలువ చేసే కుర్చీలు కూడా గనిబాబు అందజేయడంతో హెచ్ఎం,ఉపాధ్యాయులు అభినందించారు.

హోటల్ పాక దగ్ధం

తొండంగి, ఫిబ్రవరి 12: మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన పొన్నగంటి రత్నానికి చెందిన హోటల్ పాక పూర్తిగా దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో హోటల్‌లో మొత్తం సామగ్రి కాలి బూడిదైంది. సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి చం ద్రగిరి, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే రాజప్ప పరామర్శ

సామర్లకోట, ఫిబ్రవరి 12: సామర్లకోట మున్సిపల్ మాజీ కౌన్సిలర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అయిన పొడుగు చిట్టిబాబు ఆకస్మికంగా మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించి ఓదార్చారు.

కలెక్టర్‌ను కలిసిన గగారిన్



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్ సోమవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలిసి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.

పెద్దాపురంలో 'స్పందన'

పెద్దాపురం, ఫిబ్రవరి 12: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం ప్రజల నుంచి 11 అర్జీలను స్వీకరించారు.